

కుసుమ శ్రేష్ఠి 18 పట్టణములలోనుండు వైశ్యప్రముఖులను ఆహ్వానించి చక్రవర్తి కోరికను వివరించుట
102 గోత్రికులు కన్యక నిచ్చుటకు నిరాకరించిరి. మిగిలిన 612 గోత్రికుల సభాత్యాగము చేయుట

ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## ఏకదశాధ్యాయము

విష్ణువర్ధన రాజు తన పట్టణమునకు మరలిపోయిన తరువాత వైశ్యప్రభువగు కుసుమశ్రేష్ఠియు, కులగురువైన భాస్కరచార్యుడును, ధనదార్యాది మంత్రివర్యులు సమావిష్టులై తమ కర్తవ్యమును గురించి చర్చించిరి. అనంతరము భాస్కరాచార్యుడు, "నా యాజ్ఞకు ప్రత్యుత్తరములను చెప్పక, అత్యంతావశ్యకమైన కార్యము కలదు కాన తక్షణమే రావలసినదని తెలుపుచూ పత్రములను వ్రాయించి పదునెనిమిది పట్టణములలో నున్న

వైశ్యుల కెల్లరకును దూతలచే శీఘ్రముగ బంపుడు" అని కుసుమశ్రేష్ఠికి చెప్పెను. అంత గురువాక్యమును విని కుసుమాచార్యుడు అటులనే పంపెను. రాజదూతలు త్వరితముగ బోయి పత్రికలనిచ్చి మరలివచ్చిరి. పదునెనిమిది పట్టణముల వారును, దూతల వచనమును విని పత్రికలయందు వ్రాయబడిన యర్థములను కనుగొని మిక్కిలి ఆశ్చర్యము బొందిరి. తేజోవంతులు పట్టణవాసులునగు సకలవైశ్యులును ఆలోచించి ప్రయాణమై బయలుదేరి పెనుగొండకు జేరిరి.

## అష్టాదశ పట్టణముల ఆర్యవైశ్య ముఖ్యుల మహాసమావేశము - చర్యలు:-

వారి రాక దెలిసి కుసుమశ్రేష్ఠి సపరివారుడై ఎదురేగి అష్టాదశ పట్టణముల నుండి వచ్చిన వైశ్యవరులను ఆహ్వానించి తోడ్కొనివచ్చెను. వారికి సముచిత వసతి భోజన సౌకర్యములను ఏర్పరచి సత్కరించెను. ఆ మరుసటి దినమున నగరేశ్వరదేవాలయ ప్రాంగణములో సమస్త వైశ్య నగరములనుండి విచ్చేసిన 714 గోత్రముల వైశ్య ప్రతినిధులు సమావిష్టులైరి. అంత కుసుమాచార్యుడు గురునానతిగొని జరిగిన విషయముల నంతటిని సభాసదులకు సవిస్తరముగ తెలియపరచి "ఆత్మీయులారా! యీ సమస్యాపరిష్కారమునకై బాగుగా ఆలోచించి, చర్చించి కర్తవ్యమును ప్రబోధింపుడు." అని అభ్యర్థించెను. మహారాజుగారి మాటలు విని వైశ్యముఖ్యులందరును చింతాకులస్వాంతులైరి.

అంతకొందరు నగరస్వాములు సభనుద్దేశించి "సభాసదులారా! విష్ణువర్ధన భూపాలునితోడి సంబంధము అసంభవమైన విషయము. మనకీ సమస్య పురాకృత దుష్కర్మ ఫలితముగ యేర్పడినది. కోరికవల్లగాని, ద్రవ్యలోభము వల్లగాని స్వకుల ధర్మమును విడిచి, అధర్మమునకు పాలుపడువారు తప్పక నరకమును పొందగలరు." అని పలికిరి.

అపుడు కొందరు నగరస్వాములు "కన్యను రాజునకిచ్చుట అధర్మము కాదు. ఈ వివాహము వలన వైశ్యజాతికి మిక్కిలి మేలు కలుగగలదు. మనము దీనికి అంగీకరించని పక్షమున బలవంతుడైన చక్రవర్తితో విరోధము సంభవించ గలదు. మన కులమునకు ఆపద కలుగగలదు." అని పలికిరి.

అంత తేజశ్శాలియైన మాధవ శ్రేష్ఠి మొదలైన నగరస్వాములు నిలచి రాజునకు కన్యకనీయక పోయినచో మనకు ప్రమాదము కలుగనని భయపడ నవసరములేదు. మనవలననే యీ భూమి, పట్టణములు, దేశము సుభిక్షముగ నిలచియున్నవి. మనతో విరోధము పెట్టుకొని ఏ ప్రభుత్వమైననున ముందునకు కొనసాగజాలదు. దేశ సౌభాగ్య సంపదలకు ప్రధానాధారములైన కృషి గోరక్షణ వాణిజ్యములను నిర్వహించు వైశ్యులను నిర్లక్ష్యము చేసిన ఏ ప్రభుత్వమైనను అంతరించిపోకతప్పదు. మనమెందుకు భయపడవలెను? అదియునుగాక పరాశరస్మృతి ననుసరించి యీ కలియుగమున వర్ణాంతర వివాహములు నిషిద్ధములు కదా? అని ఆవేశపూరితులై పలికిరి.

అంత కులగురువైన భాస్కరాచార్యుడు నిలచి "సభాసదులారా! వర్ణాంతర వివాహము ధర్మబద్ధమా? లేక విరుద్ధమా? అనునది యిపుడు మనసమస్య కాదు. మన యువరాణి వాసవాంబిక గౌరవ బాలిక. ఆమె దివ్యగుణ సముపేతయైన మహాత్మురాలు. నిరంతరము నివృత్తి మార్గమున సంచరించుచున్న భక్తురాలు. గౌరవబాలికయైన కన్యకను బాలనాగరుడు కానట్టి వైశ్యబాలునకైనను ఇచ్చి వివాహము చేయకూడదన్న కట్టుబాటు మనకున్నదికదా." అని పలికెను. ఆ మాటలు విన్న తిప్పయార్యాది నగర స్వాములు లేచి ఆచార్యవర్యాయీ కట్టుబాట్లు మనము కల్పించుకొన్నవేకదా? పరిస్థితులను బట్టి వాటిని మార్చుకొన్నచో ప్రమాదమేమియు కలుగదు. సార్వభౌముడు కడుబలవంతుడు. అతడు మనపై దండెత్తి వచ్చి మన కన్యను బలవంతముగ

పరిణయమాడపూనుకొనినచో మనము చేయగల్గినదేమున్నది?" అని భయమును వ్యక్తపరచుచు ప్రశ్నించెను.

తోడనే కొందరు వైశ్యముఖ్యులు "సభాసదులారా! నాడు సీతాదేవినెత్తుకొని పోయిన రావణాసురుడు యేమి యనుభవించెను? ద్రౌపదిని కామించిన కీచకుడేమయ్యెను? నలుని భార్యయైన దమయంతిని బలాత్కరించబోయిన దుష్టకిరాతకుడు భస్మమైపోలేదా? మన కన్యకను వాంఛించిన విష్ణువర్ధనుని గతి కూడ అట్లే కాగలదు సుమా!" అనియనిరి.

అంత మహావీరుడును, సర్వసైన్యాధిపతియునైన విరూపాక్షుడు క్రోధారుణనేత్రుడై లేచి "పెద్దలారా! సర్వజనులు తమ తమ జాతులలో గుణశ్రేష్ఠుడైన వానికి కన్యకనిచ్చి వివాహము గావించుట సత్సంప్రదాయమనియు, సత్పురుషులీ సంప్రదాయమును విడువరనియు, విడిచిన పక్షమున ప్రాయశ్చిత్తమునకై చాంద్రాయణ వ్రతమాచరింపవలెననియు ద్విజోత్తములు చెప్పగ వినియున్నానను. దురాశాపరుడు, కాముకుడు, హింసాప్రియుడు, ధనబలదర్పయుక్తుడు అధర్మపరుడునైన చక్రవర్తికి మనకన్యనిచ్చుట మా బాలనగరసంఘమునకు ఆమోదయోగ్యము కాదు. ఈ వివాహము జరుగుటకు ఎట్టి పరిస్థితులలోను వీలులేదు" అని నొక్కివక్కాణించెను.

అనంతరము 612 గోత్రముల వైశ్యులలో ముఖ్యుడైన తిప్పయ్యశ్రేష్ఠి లేచి "సభికులారా! యీవాదోపవాదములతో ప్రయోజనములేదు. వివాహము వ్యక్తిగత విషయముకదా. కళ్యాణము చేసికొనవలసినది వాసవీకన్యక. ఆమెనే యీ సభకు పిలిపించి ఆమె అభిప్రాయమును తెలుసుకొన్న మీదట నిర్ణయములు చేయుట సముచితము. యువరాణివారిని సభకు పిలిపింపుడు." అని సూచించెను.

అపుడు కుసుమశ్రేష్ఠి గురునానతిమేరకు వాసవీకన్యకను సభాస్థలికి పిలిపించెను. తండ్రి ఆజ్ఞానుసారము కన్యక సభకరుదెంచినది. గురువృద్ధులకు నమస్కరించి జనకుని ప్రక్కన ఆసీనురాలైనది.

వాసవీకన్యక యొక్క ఆగమనముతో సభాసదులలో ఎనలేని ఆసక్తి పెరిగినది. అంతట భాస్కరాచార్యుడు చక్రవర్తి వెడలిపోయినది మొదలు జరిగిన వృత్తాంతమంతటిని, మరియు చర్చించబడిన విషయములను సభకరుదెంచిన వాసవీకన్యకను తెలియజేసెను. అనంతరము తిప్పయార్యుడు వాసవిని జూచి "ఓ రాకుమారీ! నీవు కడు వివేకవంతురాలవు. చక్రవర్తిని వివాహమాడుట వలన అఖిలాంధ్ర సామ్రాజ్యమునకే పట్టమహిషివి కాగలవు. సార్వభౌముని వలన సంభవింపనున్న ప్రమాదమును తప్పింపగలవు. అంతయు నీ అంగీకారముపైననే ఆధారపడియున్నది. ఆలోచించి నీ అభిప్రాయమును తెలియజేయవలసినది." అని పలికెను. అపుడు వాసవీకన్యక సభాసదులను చూచి "దైవస్వరూపులైన తండ్రులారా! ప్రియసోదరులారా! వివాహ విషయమున వ్యక్తికి గల స్వాతంత్ర్యమును హరించే అధికారము ఎవ్వరికినిలేదు. నా హృదయము పరాంబికా పాదార్చనకు సమర్పితము. నేను వివాహమునే వాంఛించుటలేదు. బ్రహ్మచారిణిగ నుండుటకు నిశ్చయించుకొన్నదానను." అని పలికినది.

ఆ పలుకులు విన్న 612 గోత్రముల వారు మిక్కిలి వ్యాకుల పడుచు "కుమారీ! నీ నిర్ణయముతో కులమంతటికిని చేటువాటిల్లగలదు. చక్రవర్తి పగబట్టినచో త్రాచుపాము వంటి వాడగును. అతడు బలిమిచేతనైనను నిన్నుచేగొని పోగలడు. అట్టివానిని ఎవ్వరాపగలరు." అని భీతికలుగునట్లు మాట్లాడిరి. వారి మాటలు విన్న విరూపాక్షుడు కోడెత్రాచువలె చివ్వునలేచి ఓ భీరువులారా! చక్రవర్తి దండెత్తి వచ్చినచో ధరణీచక్రమే తల్లక్రిందులై పోగలదని మాట్లాడుచున్నారు. మదాంధుడై అతడు మనపైకి వచ్చినచో

ప్రాణములతో మరలిపోవుటకల్ల. ప్రళయరుద్రుని ప్రమధగణముల వంటి మన బాలనగర సైన్యముల ప్రచండశౌర్యాగ్నిజ్వాలలలో ఆ శత్రుశలభములు మాడిమసియైపోగలవు. నా అప్రహిత ఖడ్గధారలతో వైరివీరుల మస్తకములను తెగనరికి వాటితో భీషణరణ చండికకు మేటి కపాలమాలను కూర్చి అలంకరించెదను." అని ప్రళయకాల పర్జన్యమువలె గర్జించెను. అది విని బాలనగర ప్రతినిధులందరును అమితోత్సాహపూరితులై ఆహవరంగమున శత్రువులను చీల్చి చెండాడెదమని ఆవేశపూరితులై కత్తులు దూసిరి. అంత కుసుమార్యుడు లేచి "గురుబాల వృద్ధులారా! మనము అహింసా ప్రియులమేగాని బలహీనులము కాము. ఆ దుష్ట రాజేంద్రుని దునుమాడి వాసవిని రక్షించుకొనగలము." అని క్రోధముతో వాకృచ్చెను.

వాసవీకన్యక త్యాగాహింసలతో అధర్మ దుష్టత్వములను అంతమొందించు నూతన విధానమును సభవారికి బోధించుట :-

వెనువెంటనే వాసవీకన్యక లేచి తండ్రీ! ఆర్యులారా! దుష్టత్వమును శిక్షించు నెపముతో యుద్ధములను వరించి దారుణమారణకాండలు జరిపి ప్రపంచమున ఈర్ష్యాద్వేషములును భయంకర రక్తదాహమును పెంచిరేకాని యుద్ధోన్మాదులు యిప్పటివరకును సాధించిన ఫలితమేమియున్నవి? ఒక్కరి స్వార్థమునకై లెక్కకు మిక్కిలియైనవారు బలియైపోవుట, ఎక్కడ చూచినను భీతి, అశాంతి, ఆక్రందనలు నిండిపోవుటయే కదా. ఏ విజేతయైనను విగతజీవులైన సైనికులను మరల బ్రతికించగలడా? నా రక్షణకై రణము జరుగుటకు నేనంగీకరింపను. శాంత్యహింసలకు ఆలవాలమైన వైశ్యజాతికి యీ దారుణ రణాసక్తి వాంఛనీయముకాదు. మీరందరును శాంతింపుడు" అని గంభీరముగ పలికెను.

వాసవి పలుకులువిన్న కుసుమ శ్రేష్ఠి "కుమారీ! యుద్ధమువలన తప్ప యీ సమస్య ఏవిధముగ తీరగలదు?" అని ప్రశ్నించెను. అంతకన్యక "తండ్రీ! శాంతము, అహింస, త్యాగము అను వానితో పరమక్రూరులనైనను జయింప వచ్చును. మిక్కిలి బలవంతులమైయుండియు దుష్టులైన శత్రువులను చంపక వారిలోని దుష్టత్వమును రూపుమాపగోరి వారి దుశ్చర్యలకు నిరసన దెలుపుచు మనమే కష్టనష్టములను సహించుచు అవసరమైనచో ఆత్మార్పణము జేయుటకైనను సిద్ధపడినపుడు శత్రువు ఎంతటి కఠినాత్ముడైననను వాని గుండె కరిగి నీరుగాక మానదు. అపుడు వానిలోని దుష్టత్వము అంతరించి శిష్టత్వము వెల్లివిరియగలదు. యీ ఫలితము శాశ్వతమైనది. ఇదియే కలియుగమున అధర్మమునణచి ధర్మమును ప్రతిష్ఠించుటకు అనుసరణీయమైన నూతన విధానము. ఈ విధానమే నేటి ప్రపంచమునకు ఆచరణీయము కనుక దుష్ట సార్వభౌముని నిరంకుశత్వమునకు నిరసన తెలుపుచు నేను అగ్నిప్రవేశము గావించెదను. దానితో ఆ రారాజు యొక్క తుచ్ఛవాంఛయు, రణము మారణము తప్పిపోగలవు అని గంభీరముగ ఉద్బోధించినది.

అంత 612 గోత్రముల వారు కన్యకతో "ఓ వాసవీ! సార్వభౌముని హృదయము అంత సులభముగ కరిగినీరైపోవునది కాదు. అతడు అనంత సైన్యముతో మనపైకి దండెత్తి రాగలడు అని బెదిరించిరి. తోడనే వాసవి "ఓ వైశ్యముఖ్యులారా! మనవారు ఆత్మరక్షణ గావించుకొనలేని అసమర్థులు కారు. నాయీ ఆదర్శ మార్గము బలవంతులైన త్యాగధనులకే అనుసరణీయముగాని బలహీనులైన పిరికివారికి కాదు. అట్టి బలహీనులకు పిరికివారికిని ఎప్పటికైనను అపజయము తప్పదుగదా. దుష్ట చక్రవర్తి మానవుడు కాక దానవుడే అయినను అతడు మనలను యేమియు చేయజాలడు. వాని

దుష్టత్వమును చూచిన మానవులెల్లరును అతనిని గర్హింతురు. వాని అధర్మ పరిపాలనను సహించరు. వానికి సహకరించరు. అట్టియెడ ఆ రారాజు ఒక్కడే దిక్కులేనివాడై అలమటించి అంతమొందక తప్పదు" అని మేఘ గంభీరనిస్వరముతో వాక్రుచ్చినది. వాసవీకన్యక పలుకులు మహామంత్రమువలె వివేకవంతులను ప్రభావితులగావించినది.

## ఆత్మార్పణలకు సిద్ధమయిన 102

అంత కుసుమశ్రేష్ఠి సభను పరికించి అభిమానధనులైన "ఆత్మీయులారా! వ్యక్తి స్వాతంత్ర్యమును రక్షించుటకును, నిరంకుశత్వమును నిరసించుటకును, అధర్మమును అంతమొందించుటకును నేను గూడ సతీసమేతుడనై నా పుత్రికతో గూడి ఆత్మబలిదానము గావించెదను. నాకు అనుజ్ఞ ఇయ్యవలసినది." అని అర్థించెను. ఆ మాటలు విన్న కుసుమార్యుని బంధువులగు 102 గోత్రములవారు కులధర్మముల సంరక్షణమునకై మేము కూడ అగ్నులలో పడి ఆత్మార్పణ గావించెదమని" అద్భుత త్యాగమూర్తులై ప్రకటించిరి.

ఇట్లు ధృడచిత్తులై పలికిన 102 గోత్రముల వైశ్యుల పలుకులు విని 612 గోత్రముల వైశ్యులు భీతచిత్తులై "ఓయీ! వంశగౌరవమును కాపాడుకొనుటకను భ్రమతో మీరు వంశక్షయమునకై పాల్పడుచున్నారు. ఆత్మాహుతులను పేర మీరు జరుపుకొననున్న ఆత్మహత్యలలో మేము పాల్గొనము. ఆత్మహత్య మహాపాతకహేతువు. కీర్తిని గాని అపకీర్తినిగాని జీవించి యున్నప్పుడే చూడగలము. చచ్చిసాధించునదేమి యుండును. మీరు అవివేకముతో వంశనాశనమునకై పూనుకొన్నచో మన పరస్పర బంధుత్వములు

ఇక నిలువవు. ఇక మీకును, మాకును ఎట్టి సంబంధ బాంధవ్యములు వుండవు అని నిష్ఠురమతులై పలికిరి.

612 గోత్రములవారి యిట్టి అసహ్యకరములైన, మాటలను విని 102 గోత్రముల వారు క్రోధారుణనేత్రులై, మాటిమాటికి దుర్వాదము చేయుచు స్వకులాభిమాన శూన్యులై ప్రలాపించుచున్న వారితో "ఓ స్వార్థపరులారా! మీ మాటలు విని మేము కన్యను విష్ణువర్ధనునకీయము, మీకును మాకును సంబంధము వలదు. మాతో కూడి యుండుటకు మీరు తగరు. ఇక యధేచ్ఛగ మా రాజ్యమును వీడిపోవచ్చును." అని శాసించిరి.

612 గోత్రముల వారు సభా మంటపమును వీడి బయటకు వచ్చి గుంపులుగా గూడి "యీ నూటరెండు గోత్రముల వైశ్యులు ఎంత మూర్ఖులైరి. ఇంతటి అనర్థమునకు మూలమైనది ఆ వాసవీకన్యకయే కదా. కృతయుగములో క్షత్రియకుల నాశకుడైన పరశురాముని గన్న రేణుకాదేవి వలె, త్రేతాయుగమున రాక్షస విధ్వంసమునకు కారణభూతురాలైన సీతవలె, ద్వాపరయుగమందు కౌరవ వంశక్షయమునకు కారణమైన ద్రౌపదివలె, యీ కలియుగమున వాసవీ కన్యక వైశ్యవంశార్ణవము నందు బడబాగ్ని జ్వాలయై ప్రభవించినది. ఒక్క వాసవీ కన్యక అంతరించినంత మాత్రమున కులగోత్రములకు లోపము కలుగదు. ఆమె మరణించిన పిదప చక్రవర్తి విజృంభించి తప్పక వైశ్యవంశ నిర్మూలనముగావించగలడు. బ్రతికియుండిన సుఖముల బడయవచ్చును. సువిశాల భారతావనిలో ఎక్కడికైనను పోయి హాయిగా జీవించగలము." అని పలుకుచు వడిగా ఆ పట్టణమును వీడిపోయిరి.

కుసుమశ్రేష్టి సభను ముగించినవాడై నగరేశ్వరస్వామికి నమస్కరించి పుత్రపుత్రికలతో స్వగృహమునకు వెడలిపోయెను. మిగిలిన వైశ్య శ్రేష్ఠులందరును తమకు కలుగనున్న అనంత పుణ్యకీర్తులను గూర్చి ఆలోచించుచు తమ తమ నెలవులకు వెడలిపోయిరి.